


ఆనందో బ్రహ్మ!

కష్టసుఖాల మాట ఎట్లావున్నా, ఆనందంలో దేవుడున్నాడని అంటారు. ఆనంద స్వరూపమే అఖిలాండ బ్రహ్మాండ నాయకుడని భక్తులు నమ్ముతుంటారు. ఎక్కడ ఆనందం తాండవిస్తుందో అక్కడంతా దైవత్వం ఆవరించి వుంటుందని మరో నమ్మకం. సత్యంలో కూడా దేవుడుంటాడని అంటున్నారు. అదిప్పుడు అప్రస్తుతం. నా ఆనందం మీకు దుఃఖంగా వుండవచ్చు. అంత మాత్రాన నేను దేవుడ్ని చూస్తున్నానని, తమరు దైవాన్ని దూరంగా వుంచేరని అర్థం చెప్పుకున్నా బాగుండదు. ఆనందమనే మాట సొంతం చేసుకుంటే అర్థాలు మారుతాయి. సామూహిక ఆనందాన్నే దేవుడికి అంటగట్టడం మంచిది.

సినిమాల్లో చూస్తుంటాం. గుంపుగా చేరి గంజాయి బిగించి గంతు లేస్తూ పాడుకుంటారు: అదుగో ఆ పాటలో వుంటాడు దేవుడు. వాళ్ళ ఉత్సాహంలో పాలుపంచు కుంటాడు. అందుకే ఆ మత్తులో అందరూ హరే రామ అంటారు. హరేకృష్ణ అంటారు. ఏకాంతంగా కూచుని మందు బిగించి తనకుతానే ఆనందిస్తే స్వగతంలో దేవుడు దొరకడని ఒక మందు గురువు గారు నాతో అన్నారు. ఆ స్టేటుమెంట్‌లో నిజమెంతో తెలియదు. వది లేయండి.

మందు స్వీకరిస్తున్నప్పుడు ఛీర్సు చెప్పు కుంటారు. అది నాకిష్టం లేదు. ఛీర్సు దేవుడికి చేరవనే సొంత అభిప్రాయం. అందుచేతనే, ఒక సినీ మాలో మందుసీన్లో ఒక పాత్ర చేత ఆనందో బ్రహ్మ అనిపించాను. అర్థ మేమిటని అడుగుతాడు అర్భక శిష్యుడు. ఆ ఫీల్డులో అతను బిగినేరు. అర్థం చెప్పడు, మరి వేదాంతం చెబుతాడు చదువుకున్న మరో శిష్యుడు. ఆనంద మనేది బ్రహ్మ స్వరూపం గనక అట్లా అన్నారంటాడు. ఆ మాటతో గురువుగారికి వళ్ళు మండిపోతుంది. తప్పుడర్థాలు చెప్పి జనాన్ని పాడు చేయొద్దని కోప్పడుతాడు. ఆనందో బ్రహ్మకి సింపులుగా ఒకే అర్థ మంటాడు. మందు మనం కొడతాం. కిక్కు బ్రహ్మ కొట్టుడుతుందని తేల్చి పారేస్తాడు.

బ్రహ్మంగార్ని ఈజీగా చేరుకోవాలంటే మందు కొట్టాలని నేను కొత్త సిద్ధాంతం చెప్పడంలేదు. అదొక మార్గమేమో ఆలోచించండని మనవి చేసుకుంటున్నాను. తాగుబోతుకి సంఘంలో గౌరవప్రదమైన స్థానం లేదు. నిజమే కాని, చాతకాని తాగుబోతుల వల్ల ఈ మచ్చ ఏర్పడిందని నేను అనుమానిస్తుంటాను. తాగడమనేది ప్రియురాలితో సరసం లాంటిది. షోగ్గా తాగాలి. దానికో స్టయిలుంది. రూలుంది. నీతుంది. వాటిని పాటించాలి. అవన్నీ మరిచిపోయి తప్పతాగి చిందులు తొక్కితే తాగని వాళ్ళకి అసహ్యం గానే వుంటుంది మరి. సారా తాగినా స్కాచ్ పుచ్చుకుంటున్నట్టు అందంగా తాగాలి. స్కాచ్‌ని కూడా నాటుకు మల్లె ఆబగా తాగేస్తే నేరమే అవుతుంది. చూపరులను చెదరగొట్టి తద్వారా మందు మీద ద్వేషం పెంచడమే అవు తుంది. ఆమాటకొస్తే—తాగని వాళ్ళకూడా తాగాలనే కోరికకలిగించడం ప్రతి

తాగుబోతు యొక్క ప్రథమ కర్తవ్యం. అంతేగాని తాగే వాళ్ళకూడా చిరాకు కలిగిస్తే అది ద్రోహమవుతుంది. మందు తల్లికి అపకారం చేసిన వారవుతారు.

ఇదంతా ఎందుకు చెబుతున్నానో తమకు మనవి చేయాలి. మొన్నా మధ్య బస్సెక్కి మా ఊరెడుతున్నాను. బస్సు బయలు దేరేముందు ఒక సోదరుడు 'డ్యూటీ' ముగించుకొని వెనకున్న ఆరు సీట్లలో మధ్య సీటుమీద కూర్చున్నాడు. రాత్రి ప్రయాణం కనుక దీపాలార్పేశాడు డ్రైవరు. బస్సు విజయవాడ రోడ్డెక్కగానే గుప్పున ఆస్పత్రి వాసన కొట్టింది. ఇంట్రెస్టున్న వాళ్ళకి ఇన్‌స్పిరేషన్ కలిగించినా, మందు ద్వేషుల్లో కలకలం పుట్టింది. ఆ గొడవకి బస్సు ఆపి, లైట్లు వేసేడు డ్రైవరు. వెనక సీట్లో సోదరుడికి మందుమీద నెల తప్పిందేమో వాంతి చేసుకున్నాడు. ఛీ, ఛా అన్నారంతా. సోదరుడు మాత్రం ఛీఛాలకు అతీతంగా గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. అతన్నెంతమంది ఏ విధంగా ఆడిపోసుకున్నారో నా కిప్పటికీ గుర్తుంది. అతన్ని కడిగితే కడిగేరు—అతని వంకమీద భూప్రపంచంలో వున్న యావత్తు తాగుబోతు జాతినీ దుమ్మెత్తి పోసినప్పుడు నా గుండెల్లో ముల్లు గుచ్చుకున్నంత బాధ అనుభవించాను. అనాగరికుడైన ఆ మందు సోదరుడ్ని నేను క్షమిస్తే క్షమించవచ్చుగాని మిగతావాళ్ళు శాపాలే పెట్టారు.

ప్రయాణం చేస్తున్నప్పుడు రైల్లోనో, బస్సుల్లోనో ఆనందబ్రహ్మల్ని దింపేస్తే ఇలాగే వుంటుంది. దీనికో ప్లేసూ, టైమూ వున్నాయని అర్థం చేసుకోవాలి. ఎక్కడ పడితే అక్కడ ముగ్గేసి బ్రహ్మని కూచోబెడితే కళ్ళు పోతాయి. అంచేత సహృదయ పానప్రియులు ఇల్లాంటి పొరపాట్లుచేసి తమ జాతిని అవమానించ కూడదనే విన్నపాన్ని ఇందుమూలంగా తెలీజేసుకుంటున్నాను.